
సాక్షి నిర్మల్
సోమవారం । 26 । ఆగస్టు । 2024



నిర్మల్ కవులకు పురస్కారాలు

గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా ఇచ్చే గిడుగు జాతీయ సాహితీ కళా, సేవారంగాల పురస్కారాలు నిర్మల్ జిల్లా వాసులను వరించాయి. 8లో▸

గడ్డెన్నవాగుకు స్వల్ప ఇన్‌ఫ్లో

భైంసాటౌన్: పట్టణ శివారులోని గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో మొదలైంది. ఎగువన కురిసిన వర్షాలకు ఆదివారం ప్రాజెక్టులోకి 464 క్యూసెక్కుల వరద వచ్చి చేరినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 358.7 మీటర్లు కాగా, ప్రస్తుతం 357.6 మీటర్ల నీటినిల్వ ఉంది. ప్రాజెక్టుకు ఈ సీజన్‌లో ఇప్పటివరకు 0.650 టీఎంసీల ఇన్‌ఫ్లో వచ్చింది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.1 /23.1

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్

భైంసాటౌన్: రానున్న వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ సూచించారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హిందూ ఉత్సవ సమితి సభ్యులు, గణేశ్ మండలి నిర్వాహకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతియుత ఉత్సవాల నిర్వహణకు పోలీసులకు సహకరించాలని కోరారు. సమావేశంలో సీఐ డి.రాజారెడ్డి, ఎస్సైలు, ఉత్సవ సమితి సభ్యులు ఉన్నారు.

ఈపీఎఫ్ లబ్ధిదారుల అవగాహన శిబిరం

మంచిర్యాలటౌన్: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ(ఈపీఎఫ్‌వో) ప్రాంతీయ కార్యాలయం కరీంనగర్‌కు చెందిన అధికారులు ఈ నెల 27న ఈపీఎఫ్ లబ్ధిదారులకు అవసరమైన సేవలు అందించేందుకు ఒక్కరోజు శిబిరాన్ని ఉమ్మడి జిల్లాలో నిర్వహించనున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ సెల్వట్కర్ తానయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 27న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు ఉమ్మడి జిల్లాలోని ఆయా జిల్లాలో నిర్వహిస్తున్నామని, పీఎఫ్ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంచిర్యాల జిల్లాకు సంబంధించి మంచిర్యాలలోని డీఆర్డీఏ కాన్ఫరెన్స్ హాల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ కాగజ్‌నగర్‌లోని శ్రీకృష్ణవేణి హైస్కూల్‌లో, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డీఆర్డీఏ కాన్ఫరెన్సు హాల్‌లో, నిర్మల్‌లో ప్రిన్స్ హైస్కూల్, గాజుల్‌పేట, పాత ఎన్‌హెచ్7 రోడ్డులో ఈ శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.


రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక



ప్రశంసాపత్రం అందుకుంటున్న దృశ్యం

సోన్: రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు మండలంలోని అభ్యాస గురుకుల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పుల్లూరి ప్రదీప్‌కుమార్ తెలిపారు. భైంసా పట్టణంలోని బృందావన్ గార్డెన్‌లో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో అండర్– 10 బాలుర విభాగంలో నైతిక్, అండర్–12 బాలికల విభాగంలో ఫర్హానాజ్, అండర్– 14 బాలికల, బాలుర విభాగంలో ఆరేపల్లి వర్షిణి, ఇందూరి సంజయ్ ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు.

విద్యార్థులకు పురస్కారాలు



పురస్కారం అందుకుంటున్న హను

నిర్మల్‌టౌన్: పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మున్నూరుకాపు ట్రస్ట్ బోర్డ్ ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాలు అందజేశారు. హైదరాబాద్‌లోని కాచిగూడ మున్నూరుకాపు వసతి గృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో అత్యుత్తమ మార్కులు పొందిన విద్యార్థులకు ట్రస్ట్ బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ ఎంఆర్.వెంకటరావు పురస్కారాలతోపాటు, నగదు పారితోషకం అందజేశారు. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన గుమ్ముల అశోక్ కూతురు హను ఇంటర్‌లో 96% ఉత్తీర్ణత సాధించి ఉత్తమ పురస్కారం అందుకుంది.

జాబ్‌మేళాకు విశేష స్పందన

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని దీక్ష జూనియర్ కళాశాలలో అఖిల భారత అయ్యప్ప సేవా ట్రస్ట్, ప్రసన్న హరికృష్ణ విన్నర్స్ సహకారంతో ఆదివారం జాబ్‌మేళా నిర్వహించారు. మున్సిపల్ చైర్పన్ గండ్రత్ ఈశ్వర్ జ్యోతి ప్రజ్వలన చేసి జాబ్‌మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు శ్రీనివాస్, కనపర్తి విగ్నేష్ మాట్లాడుతూ.. మేళాలో 50 కంపెనీలు పాల్గొన్నట్లు తెలిపారు. సుమారు 1,500 పైచిలుకు నిరుద్యోగులు వివిధ కంపెనీలలో ఉద్యోగాలు పొందారని పేర్కొన్నారు. నిరుద్యోగులు చెడుమార్గం అనుసరించకుండా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అఖిలభారత సేవా ట్రస్ట్ సభ్యులు మసీదు రాజాగౌడ్, జాప ప్రకాశ్, జనగాం శ్రీనివాస్, బండారి వీరబాబు, మండాజి మారుతి, అయ్యప్ప సేవాసమితి అధ్యక్షుడు బద్రి శ్రీనివాస్, అయ్యప్ప భక్తులు, దీక్ష కాలేజ్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

వస్తుందా.. నిడ్రా!



నిర్మల్‌లో చెరువుకట్టను వదలకుండా చేసిన ఆక్రమణ

- నిర్మల్ కబ్జాలపై ప్రభుత్వం దృష్టి?
- ప్రభుత్వం మారినా ఆగని ఆక్రమణలు
- ఇప్పటికే చెరలో చెరువులు
- కుంటలనూ కబ్జా చేస్తున్న నేతలు
- 'నిడ్రా' కావాలంటున్న జిల్లా వాసులు..

నిర్మల్: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో చెరువులు, ప్రభుత్వ స్థలాలను చెరబట్టిన ఆక్రమణదారులను గడగడలాడిస్తున్న హైడ్రా తరహాలో నిర్మల్‌కూ 'నిడ్రా' కావాలంటున్నారు జిల్లా వాసులు. హైడ్రా దూకుడు చూస్తున్న జిల్లా వాసులు.. ఇప్పుడు ఏ నలుగురు కలిసినా ఇప్పుడు ఇదే అంశంపై మాట్లాడుకుంటున్నారు. సోషల్ మీడియాలో మొత్తం హైడ్రాపైనే చర్చిస్తున్నారు. వందల సంఖ్యలో పోస్టులు వైరల్ అవుతున్నాయి. అధికారం ముసుగులో, ధనబలం అండతో పాలకులు, బడాబాబులు చేసిన కబ్జాలను నేలమట్టం చేస్తున్న తీరుపై ప్రజల నుంచి సానుకూల స్పందన వస్తోంది. ఇదేతరహాలో నిర్మల్‌లోనూ నేతలు, పలుకుబడి ఉన్నవాళ్లు చెరబట్టిన చెరువులకు విముక్తి కల్పించాలని కోరుతున్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా.. జిల్లా కేంద్రంలో ఆక్రమణలపర్వం ఆగకపోవడం, కళ్ల ముందే చారిత్రక గొలుసుకట్టు చెరువుల ఉసురు తీస్తుండటంతో 'అయ్యో.. కాపాడేవాళ్లే లేరా..!?' అంటూ ఏళ్లుగా నిర్మల్‌వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులకు ఫిర్యాదులు చేసి విసిగి వేసారిన నిర్మల్‌వాసులకు హైదరాబాద్‌లో ప్రయోగిస్తున్న హైడ్రా బ్రహ్మాస్త్రం బాగా నచ్చింది. అదే తరహాలో జిల్లాలో నిడ్రా ఏర్పాటు చేయాలన్న డిమాండ్ పెరుగుతోంది.

హైడ్రాపై చర్చ ఎందుకంటే..

ఎక్కడో హైదరాబాద్ ఆక్రమణలపై హైడ్రా(హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్) చర్యలు చేపడుతుంటే.. హైదరాబాద్‌ను మించి నిర్మల్‌లో ఆక్రమణలు జరిగాయి.. ఇప్పటికీ ఇంకా జరుగుతూనే ఉన్నాయి. కళ్ల ముందే వందల ఏళ్లనాటి చెరువులను చెరబట్టి ఖతం చేసిన తీరు సాధారణ పౌరుడినీ బాధిస్తోంది. తాము చూస్తున్న చెరువులను తమ పిల్లలైనా చూస్తారో లేదో అని ఈతరం ఆందోళన చెందుతోంది. అందుకే హైడ్రా తరహాలో నిడ్రా(నిర్మల్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్) కావాలన్న డిమాండ్ పెరుగుతోంది. సామాన్యులు సైతం దీన్ని బలంగా కోరుకుంటున్నారు.

మొక్కుబడిగా లేక్ కమిటీ..


జిల్లాలో ఇప్పటికే పలు శాఖలతో కూడిన లేక్‌కమిటీ ఉంది. కానీఆ కమిటీ తీసుకుంటున్న చర్యలపైన ప్రజలు పెదవి విరుస్తున్నారు. కేవలం సామాన్యులపైనే లేక్ కమిటీ ప్రతాపం చూపుతోంది. బడాబాబులు చేసిన కబ్జాలను చూసీ చూడనట్లు వదిలేస్తోంది. తెలిసీతెలియక చెరువుల పరిధిలో ఉన్న భూములను కొన్న సామాన్యులనే బలిపశువులను లేక్ కమిటీ అధికారులు బలి చేస్తున్నారు. కావాలని కబ్జా చేసిన నేతలు, బడాబాబులను పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. హైడ్రా పెద్ద చిన్న అని చూడకుండా దూకుడు ప్రదర్శిస్తోంది. ప్రముఖ సినీ నటుడు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్‌ను సైతం నేలమట్టం చేయడం, బడాబాబులవీ వదలకుండా కూల్చేస్తుండటం జిల్లా వాసులను ఆకట్టుకుంటోంది. ఇదేతరహాలో నిర్మల్‌లో నూ ఆపరేషన్ చేపడితే చెరబట్టిన చెరువులు, కబ్జా అయిన కుంటలకు విముక్తి కలుగుతుందని భావిస్తున్నారు. మరోవైపు ప్రజల నుంచి సానుకూల స్పందనలు వస్తుండటంతో రాష్ట్ర వ్యాప్తంగా హైడ్రా తరహా ఆపరేషన్ చేపట్టే ఆలోచన చేస్తోంది.

అమలుకాని కోర్టు ఆదేశాలు..



జిల్లా కేంద్రంలో గొలుసుకట్టు చెరువులనూ వదలకుండా కబ్జాలు చేశారు. వీటిపై కోర్టులు ఇచ్చిన ఆదేశాలనూ జిల్లా అధికారులు అమలు చేయడం లేదు. ప్రస్తుతం హైడ్రా తరహాలో నిర్మల్‌లోనూ చెరువులు, ప్రభుత్వ స్థలాల రక్షణకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.
– అంజుకుమార్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

నిర్మల్‌లో ఆపరేషన్ చేపట్టాలి..



నిర్మల్‌లో ఇప్పటికీ చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ ఏరియాల్లో నిర్మాణాలను చేస్తుండటం దారుణం. గొలుసుకట్టు చెరువులను కాపాడుకోవాలంటే కచ్చితంగా కూడా హైడ్రా తరహాలో ఆపరేషన్ చేపట్టాలని కోరుతున్నాం. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలి.
– సురేందర్, నిర్మల్

చెరువులే లేకుండా..



ఎక్కడా లేనంతగా నిర్మల్‌లో జలవనరులు ఉన్నాయి. ఓరుగల్లు తరహాలో ఇక్కడ జిల్లాకేంద్రం చుట్టూ గొలుసుకట్టు చెరువులు ఉన్నాయి. కానీ వాటిని పాలకులు, బడాబాబులు చెరపట్టి భవిష్యత్తులో చెరువులే లేకుండా చేస్తున్నారు. ఇప్పటికే చాలా చెరువులు కుంచించుకుపోయాయి.
– పోశెట్టి, నిర్మల్

నిడ్రా ఏర్పాటు చేయాలి..



హైదరాబాద్‌లో ఎలాగైతే హైడ్రాను ఏర్పాటు చేసి చెరువుల పరిరక్షణ చేపడుతున్నారో.. అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలి. నిర్మల్ చెరువుల పరిరక్షణకు నిడ్రా ఏర్పాటు చేసి ప్రత్యే ఆపరేషన్ చేపట్టాలి. చెరువులను చెరవిడిపించాలి.
– రమేశ్, నిర్మల్

మాఫీ మాకు వర్తించదా?



సోన్ మండలం మాదాపూర్ రైతు వేదికలో అర్జీలు స్వీకరిస్తున్న వ్యవసాయ అధికారులు

- గ్రీవెన్స్‌కు వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు
- మండలాల్లోనూ దరఖాస్తుల స్వీకరణ
- మూడు రోజుల్లో 6,526 అర్జీలు
- మాఫీ ఎందుకు కాలేదో ఫోన్లకు మెసేజ్ పంపుతున్న అధికారులు
- తప్పులు సరిచేసి ప్రభుత్వానికి నివేదిస్తామని వెల్లడి

నిర్మల్‌చైన్‌గేట్: పంట రుణాల మాఫీతో రుణ విముక్తులమవుతామని భావించిన అన్నదాతల ఆశలు నెరవేరలేదు. మూడు విడతల్లో రైతుల పంట రుణాలు మాఫీ చేశామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ జిల్లాలో వేలాదిమంది రైతుల అప్పులు అలాగే ఉండిపోవడంతో ఆందోళన చెందుతున్నారు. తమ పంట రుణం ఎందుకు మాఫీ కాలేదో తెలుసుకోవడానికి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సర్కారు తీరుపై ఆగ్రహంతో ఆందోళనలకూ దిగుతున్నారు. అర్హులందరి పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

గ్రీవెన్స్‌కు దరఖాస్తుల వెల్లువ..

రుణమాఫీ కాని రైతులు వ్యవసాయశాఖ కార్యాలయాల్లోని గ్రీవెన్స్ సెల్‌కు పెద్ద ఎత్తున క్యూ కడుతున్నారు. తమ రుణం ఎందుకు మాఫీ కాలేదో చెప్పాలని దరఖాస్తు ఇస్తున్నారు. గ్రీవెన్స్ ప్రారంభించిన మూడు రోజుల్లోనే జిల్లాలో 6 వేలకుపైగా దరఖాస్తులు రావడమే గమనార్హం. ఇదిలా ఉంటే ఇప్పటి వరకు మూడు విడతల్లో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల వరకు రుణాలను మాఫీ చేసింది. మొదటి విడతలో జిల్లాకు 30,109 మంది రైతులకు, రెండో విడతలో 19,058 మంది రైతులకు, మూడో విడతలో 16,835 మంది రైతులకు రుణమాఫీ సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేసింది. అయితే వివిధ కారణాలతో జిల్లాలో అనేక మంది రైతులకు రుణమాఫీ కాలేదు. దీంతో రైతులు పెద్ద ఎత్తున వ్యవసాయ శాఖ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో రైతుల సమస్యలను నివృత్తి చేస్తూ.. రుణమాఫీకాని వారి నుంచి కొత్తగా దరఖాస్తులు స్వీకరించేందుకు జిల్లా కేంద్రంలోని వ్యవసాయ శాఖకార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశారు. మండల కేంద్రాల్లోనూ దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. శుక్రవారం నాటికి జిల్లాలోని అన్ని మండలాలకు సంబంధించి 6,526 దరఖాస్తులు వచ్చినట్లు వ్యవసాయాధికారులు పేర్కొన్నారు.

మండలాల్లో నోడల్ అధికారులు..

రూ.2 లక్షల వరకు రుణమాఫీ కాని రైతుల నుంచి వివరాల రూపంలో దరఖాస్తులు తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మండల వ్యవసాయాధికారులను నోడల్ అధికారులుగా నియమించింది. దీంతో జిల్లాలోని అన్ని మండల వ్యవసాయ కార్యాలయాల్లో వ్యవసాయాధికారులు రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. మొత్తం స్వీకరించిన దరఖాస్తుల్లో తప్పొప్పులన సరిచేసి ఆ వివరాలను ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో పొందుపర్చి ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నారు. ఏ తప్పిదంతో రుణమాఫీ కాలేదో సరిచేసిన అనంతరం ఆయా రైతుల ఖాతాల్లో ప్రభుత్వం డబ్బులు జమ చేయనున్నట్లు వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. రూ.2 లక్షలకుపైగా ఉన్న పంట రుణాలపై రాష్ట్ర ప్రభుత్వం నేటికీ ఆలోపు రుణాలు ఉన్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా ఇన్‌కం ట్యాక్స్ చెల్లించేవారు, పెన్షనర్లు, ప్రభుత్వ ఉద్యోగులు కూడా తమకు రుణమాఫీ కాలేదంటూ వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదిస్తున్న నేపథ్యంలో వారి ఆధార్ నంబర్ ఆధారంగా పోర్టల్లో చూసి రుణమాఫీ ఎందుకు కాలేదు ఫోన్ ద్వారా సమాచారం ఇస్తున్నారు.

ఆగస్టు 23 వరకు వచ్చిన దరఖాస్తులు..

1. కుటుంబ సభ్యుల వివరాలకు సంబంధించి	2,727
2. రూ.2 లక్షలకుపైగా ఉన్న పంట రుణాలపై	901
3. నో డేటా అని చూపిన వారివి	510
4. ఆధార్ నంబర్ తప్పుగా ఉన్నవి	208
5. పేర్లు సరిపోలని వారివి	700
6. బ్యాంకు వివరాలకు సంబంధించినవి	1051
7. సహకార సంఘాలవి	3
8. పాస్ పుస్తకాలకు సంబంధించినవి	281
9. డెబిట్ ఫెయిల్యూర్	42
10. ఇతర కారణాలు	103



గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే కనిపించే స్క్రీన్

మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులు

మండలం	ఫిర్యాదుల సంఖ్య
భైంసా	259
కుభీర్	301
కుంటాల	167
ముధోల్	267
బాసర	558
తానూర్	623
లోకేశ్వరం	451
సోన్	538
నిర్మల్ రూరల్	263
నిర్మల్ అర్బన్	1
నర్సాపూర్(జి)	139
లక్ష్మణచాంద	389
దిలావర్‌పూర్	136
మామడ	1,158
సారంగాపూర్	257
ఖానాపూర్	421
పెంబి	213
కడెం	295
దస్తూరాబాద్	90

ఆయకట్టుకు భరోసా..!

- గడ్డెన్నవాగు ఎండీడీఎల్ తగ్గింపు
- చివరి వరకు అందనున్న సాగునీరు



గడ్డెన్నవాగు ప్రాజెక్టు

భైంసాటౌన్: భైంసా, లోకేశ్వరం మండలాల పరిధిలోని 14 వేల ఎకరాలకు సాగునీరందించాలనే ఉద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి భైంసా పట్టణ శివారులో సుద్దవాగుపై ప్రాజెక్టు నిర్మించారు. 1.8 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యం ప్రాజెక్టుకు మాజీ ఎమ్మెల్యే గడ్డెన్న పేరు పెట్టారు. ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా భైంసా మండలం వాలేగాం మీదుగా లోకేశ్వరం మండలంలోని రాజురా వరకు సాగునీరందుతోంది. 2017లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి నీరందించాలన్న ఉద్దేశంతో ప్రాజెక్టు సమీపంలోనే మిషన్ భగీరథ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మించింది. ఇందుకుగాను గడ్డెన్నవాగు ప్రాజెక్టు నుంచి రోజుకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగించుకునేలా జీవో 885 జారీ చేసింది. దీని ప్రకారం ప్రాజెక్టులో 357.5 మీటర్ల నీటిమట్టం ఉంటేనే సాగునీటికి నీటిని విడుదల చేయాలని, అంతకంటే తగ్గితే, సాగునీరు విడుదల చేయవద్దని జీవోలో పేర్కొంది. అంటే ఈ లెక్కన 0.52 టీఎంసీలు సాగునీటికి, మిగిలిన 1.28 టీఎంసీలు మిషన్ భగీరథ కోసం వినియోగించేవారు. దీంతో ఏటా వేసవికాలంలో ఆయకట్టు చివరివరకు సాగునీరు అందక రైతులు నష్టపోయేవారు.

ఎండీడీఎల్ తగ్గిస్తూ జీవో..

పంటలసాగు కోసం ఉద్దేశిస్తూ నిర్మించిన గడ్డెన్నవాగు ప్రాజెక్టు నుంచి మిషన్ భగీరథకు అధికశాతం నీటిని వినియోగిస్తుండడంతో పంటలకు నీరందని పరిస్థితి నెలకొంది. దీంతో ఈ విషయమై ప్రాజెక్టు అధికారులు ఎండీడీఎల్(మినిమం డ్రాడౌన్ లెవెల్)ను తగ్గించాలని గత ఫిబ్రవరిలో ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ప్రభుత్వానికి విన్నవించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి దృష్టికి సమస్య తీసుకెళ్లారు. స్పందించిన ప్రభుత్వం ఈ మేరకు ప్రాజెక్టులో ఎండీడీఎల్ స్థాయిని తగ్గిస్తూ ప్రత్యేక జీవో జారీ చేసింది. ఇదివరకు ప్రాజెక్టులో 357.5 మీటర్ల నీటినిల్వ ఉంటేనే సాగునీటికి వినియోగించాలన్న నిబంధన ఉండగా, ప్రస్తుత జీవోలో దానిని 355.9 మీటర్లకు తగ్గిస్తూ సడలింపు ఇచ్చింది. ఫలితంగా ఇకపై మిషన్ భగీరథకు 0.72 టీఎంసీలు, సాగునీటికి 1.1 టీఎంసీలు నీటిని వినియోగించుకునేలా వెసులుబాటు కల్పించింది. ఫలితంగా ఆయకట్టు కింద 14 వేల ఎకరాలకు పూర్తిస్థాయిలో సాగునీరందుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

ఆదేశాలు అందలేదు..

గడ్డెన్నవాగు ప్రాజెక్టులో మినిమం డ్రా డౌన్ లెవెల్‌ను సవరించాలని గత ఫిబ్రవరిలోనే ప్రభుత్వానికి నివేదించాం. 2017 జీవో ప్రకారం మిషన్ భగీరథకు నీటి అవసరాల నేపథ్యంలో ప్రాజెక్టులో 357.5 మీటర్లకు మించి నీటి నిల్వ ఉంటేనే సాగునీటికి వినియోగించుకోవాల్సి వచ్చేది. దీంతో ఆయకట్టు చివరి వరకు నీరందేది కాదు. ఈ మేరకు 355.9 మీటర్లకు తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరాం. ఆదేశాలు ఇంకా అందలేదు.
– అనిల్, డీఈఈ, గడ్డెన్నవాగు ప్రాజెక్టు

రైతుల కోసమే గడ్డెన్న వాగు కనిష్ట నీటిమట్టం తగ్గింపు

- ఆయకుట్ట రైతులకు లబ్ధి
- ప్రత్యేక జీవో విడుదల
- ఎమ్మెల్యే రామారావుపటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

భైంసా: రైతుల శ్రేయస్సే తన లక్ష్యమని ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ అన్నారు. భైంసాలోని తన నివాసంలో ఆదివారం మాట్లాడారు. భైంసా పట్టణానికి ఆనుకుని ఉన్న గడ్డెన్నవాగు ప్రాజెక్టులో మిషన్‌భగీరథ కింద భైంసా సబ్ డివిజన్‌లోని చాలా గ్రామాలకు తాగునీరు అందుతుందన్నారు. తాగునీటి అవసరాల దృష్ట్యా గడ్డెన్నవాగు ప్రాజెక్టులో 357.500 మీటర్ల నీటి వరకు సాగునీటిని వదిలి అలాగే నిల్వ ఉంచేవారన్నారు. ప్రాజెక్టు సామర్థ్యంతో తాగునీటికి ఇబ్బందులుకాకుండా ప్రాజెక్టులో 355.900 మీటర్ల నీటి నిల్వ తగ్గేవరకు రైతులకు సాగునీరు అందేలా అధికారులతో చర్చించామని తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం తన వినతిని పరిగణలోకి తీసుకుందని పేర్కొన్నారు. ఈమేరకు నీటి నిల్వను సవరిస్తూ ప్రత్యేక జీవో 215 జారీ చేసిందని తెలిపారు. దీంతో గడ్డెన్నవాగు ప్రాజెక్టు కింద 14 వేల ఎకరాల రైతులకు లబ్ధి కలుగుతుందని చెప్పారు. ఈ జీవోతో ప్రాజెక్టు కింద మరో 6 వేల ఎకరాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న రోజుల్లో గడ్డెన్నవాగు ప్రాజెక్టు ఎగువభాగంలో లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మించి కుభీర్ మండల రైతులకు సాగునీరు అందేలా చూస్తామని తెలిపారు. మిషన్‌భగీరథ పథకంలో తాగునీరు అందించేందుకుగాను 355.900 మీటర్లకు కుదించడంతో రైతుల పొలాలకు 0.6 టీఎంసీల మేర సాగునీటి అవసరాలకు వాడుకునే అవకాశం దక్కిందని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో బీజేపీ తానూర్ మండల అధ్యక్షుడు యాతాలం చిన్నారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోపాల్‌సర్దా, భైంసా మున్సిపల్ కౌన్సిలర్ కపిల్, నాయకుడు కృష్ణ పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థులకు 'అక్షరమాల' ప్రోత్సాహకం



పారితోషకం అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

నిర్మల్ రూరల్: అక్షరమాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత విద్యా సంవత్సరం 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఇద్దరు జిల్లా విద్యార్థులకు ఐఐటీ హైదరాబాద్ నిర్వాహకులు పారితోషకాన్ని శనివారం అందజేశారు. అక్షరమాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత విద్యా సంవత్సరం జిల్లాలోని ఎంపిక చేసిన 12 పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు హైదరాబాద్‌లోని వివిధ ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులతో సాయంత్రం వేళల్లో ఆన్‌లైన్‌లో సైన్స్, గణితశాస్త్రం తరగతులు నిర్వహించారు. వార్షిక పరీక్షల్లో 10 జీపీఏ సాధించిన ప్రతీ జిల్లా నుంచి ఇద్దరు పేద విద్యార్థులను ఎంపిక చేశారు. జిల్లాలో పాత ఎల్లాపూర్ జిల్లాపరిషత్ పాఠశాలకు చెందిన ఎలగందుల అకిల, బోసి ఉన్నత పాఠశాలకు చెందిన బుట్టి లక్ష్మికి ఒక్కొక్కరికి రూ.4 వేల చొప్పున ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్.మూర్తి, ఎస్సీఈఆర్టీ ప్రొఫెసర్ సురేశ్‌బాబు అందజేశారు. ఈ సందర్భంగా అక్షరమాల ఫౌండేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్.మూర్తి మాట్లాడుతూ పేద విద్యార్థులకు తనవంతు సాయం చేయాలని, వారిలో ఆత్మస్థైర్యం నింపాలని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వలంటీర్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఇద్దరు విద్యార్థులను డీఈవో రవీందర్‌రెడ్డి అభినందించారు. ఇందులో ప్రధానోపాధ్యాయులు రమాదేవి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి రూ.6 లక్షల చెక్కు



చెక్కు అందజేస్తున్న సంఘ నాయకులు

నిర్మల్ రూరల్: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవలే మరణించిన ఉపాధ్యాయుడి కుటుంబ సభ్యులకు రూ.6 లక్షల చెక్కును ఆదివారం నాయకులు అందజేశారు. మండలంలోని తలవేద ప్రాథమిక పాఠశాల ఎస్జీటీ ఉపాధ్యాయుడు, టీఎస్ యూటీఎఫ్ జిల్లా నాయకుడు నాకిడి బక్కన్న(58) అనారోగ్యంతో ఈనెల 10న మరణించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలనే ఉద్దేశంతో సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆయన కుటుంబ సభ్యులకు రూ.6 లక్షల చెక్కును రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి అందజేశారు. సంఘం అభివృద్ధికి బక్కన్న చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఇందులో జాతీయ పెన్షనర్స్ సంఘం కార్యదర్శి ఎంసీ.లింగన్న, సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి శంకర్, పెంట అశోక్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు భూమన్నయాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్నాలో ఔట్‌సోర్సింగ్ కార్మికులు



ధర్నాలో పాల్గొన్న కార్మికులు

ఖానాపూర్: తెలంగాణ రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన ధర్నాలో జిల్లాలోని అటవీ శాఖలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ కార్మికులు పాల్గొన్నారు. తమకు కొన్ని నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. పెండింగ్ వేతనాలతోపాటు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు నారపాక స్వామి, ప్రధాన కార్యదర్శి నాగవత్ ఉపేందర్, ఉపాధ్యక్షుడు రాథోడ్ సంజు, నాయకులు రాజేశ్, ఎన్.రాజేశ్, శంకర్, రాజేందర్, రవీందర్, భీంరావు, సాయి, నరేశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైన్స్‌లో చోరీ



దొంగలు ధ్వంసం చేసిన వైన్స్ షట్టర్

నేరడిగొండ: మండల కేంద్రంలోని వరుణ్ లిక్కర్ మార్ట్ వైన్స్‌లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని దుండగులు వైన్స్ షట్టర్ పగులగొట్టి లోనికి చొరబడి మందు బాటిళ్లు, రూ.1.50 లక్షల నగదు ఎత్తుకెళ్లినట్లు వైన్స్ నిర్వాహకుడు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. దొంగలు ఎత్తికెళ్లిన మందు బాటిళ్ల అట్టపెట్టెలు వైన్స్ సమీపంలో పడేసినట్లు పోలీసులు గుర్తించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



ప్రాజెక్ట్‌లో బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

కడెం: కడెం ప్రాజెక్ట్ పరిసరాలు ఆదివారం పర్యాటకులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు ప్రాజెక్ట్ అందాలను తిలకించారు. కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి ప్రాజెక్ట్‌లో బోటింగ్ చేసి ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు.

భర్త ఇంటి ఎదుట భార్య దీక్ష

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శాంతినగర్ కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్న ఓ ఉపాధ్యాయుడి భార్య తనను కాపురానికి తీసుకువెళ్లడం లేదని కుటుంబ సభ్యులతో కలిసి భర్త ఇంటి ఎదుట ఆదివారం దీక్ష చేపట్టింది. కోర్టు తీర్పు వచ్చి నెలైనా తనను తీసుకువెళ్లడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. తనకు న్యాయం చేయాలని కోరింది.

కుక్కల దాడిలో జింకకు గాయాలు



గాయపడ్డ జింకతో గ్రామస్తులు

కుభీర్: మండలంలోని చొండి పరిసరాల్లో ఆదివారం మధ్యాహ్నం కృష్ణజింకను కుక్కలు వెంబడించాయి. అది పరిగెత్తుకుని గ్రామంలోకి వచ్చింది. వెంటనే గణేశ్, శ్రీకాంత్ అనే యువకులు జింకను కుక్కలను నుంచి కాపాడి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ అధికారి కరీమ్ వచ్చి జింకను రేంజ్ కార్యాలయానికి తీసుకెళ్లారు. కుక్కలు కరవడంతో జింక రెండు కాళ్లకు గాయాలయ్యాయి. మాజీ ఎంపీటీసీ రాందాస్, గ్రామస్తులున్నారు.

దేశీదారు పట్టివేత



దేశీదారు బాటిళ్లతో పోలీసులు

కుభీర్: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులపై ఆదివారం దాడి చేసి ఎం.విఠల్ వద్ద 4.14లీటర్ల దేశీదారు పట్టుకున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. దీని విలువ రూ.1,640 ఉంటుందని పేర్కొన్నారు. విఠల్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వంట గ్యాస్ సిలిండర్ల చోరీ

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్ కాలనీలో నివాసముంటున్న ప్రైవేట్ ఉపాధ్యాయుడు శంకర్ ఇంట్లోని ఒక ఖాళీ సిలిండర్, ఒక నిండు సిలిండర్‌ను ఆదివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

విద్యార్థులకు చేయూత

- సేవా కార్యక్రమాల్లో పలువురు
- జిల్లాలో ఏటా స్టడీ మెటీరియల్ పంపిణీ

తాంసి: హైదరాబాద్‌కు చెందిన సంగిశెట్టి బాబు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గత ఆరేళ్లుగా ఆదిలాబాద్ జిల్లాలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ప్రతియేటా రూ.5లక్షలకు పైగా విలువైన స్టడీ మెటీరియల్, స్టీల్ బాటిళ్లు పంపిణీ చేస్తున్నారు. బాబు తండ్రి శంకరయ్య 2005లో, తల్లి యాదమ్మ 2015లో మృతిచెందగా వారి స్మారకార్థం సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని యాదశంకర మెమొరియల్ ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. ఇప్పటికే జిల్లాలోని తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్యాగులు, పెన్నులు, తరగతుల వారీగా నోట్‌పుస్తకాలు, పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు. ఈ ఏడాది విద్యార్థులకు తాంసి, తలమడుగు పాఠశాల్లో విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్లు, 9వ, 10వ తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ డిక్షనరీలు అందించారు. విద్యార్థులు చదువులో రాణించేలా ప్రోత్సాహం అందిస్తున్నామని ట్రస్టు చైర్మన్ బాబు తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



పంపిణీ చేసిన బాటిళ్లు, స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు, ఫౌండేషన్ చైర్మన్ బాబు

తాంసి మండలం కప్పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు విలాస్‌గౌడ్ ప్రతియేటా విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్నారు. విలాస్‌గౌడ్ భార్య కృష్ణకుమారి తలమడుగు మండలం ఖోడద్ పాఠశాలలో ఉపాధ్యాయినిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ దంపతులు తమ వంతు సాయంగా ప్రతియేటా రూ.2లక్షల విలువైన స్టడీ మెటీరియల్ విద్యార్థులకు అందిస్తున్నారు. జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామాల్లో ఉన్న పాఠశాల విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు, నోట్‌బుక్‌లు, పెన్సిల్, ఇతర సామగ్రి కిట్‌గా తయారు చేసి పంపిణీ చేస్తున్నారు. గత సంవత్సరం జిల్లాలోని 3100 మంది మారుమూల గ్రామాల్లో ఉన్న విద్యార్థులకు వస్తువులు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రోత్సహించడంలో భాగంగా స్టడీ మెటీరియల్ అందజేస్తున్నట్లు ఉపాధ్యాయ దంపతులు తెలిపారు.



పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను అందజేస్తున్న ఉపాధ్యాయుడు విలాస్ గౌడ్



ట్రస్ట్ తరఫున ఇచ్చిన బ్యాగులతో విద్యార్థులు

సమనుజ్ఞ ట్రస్ట్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన విశ్వనాథ్ అడ్వకేట్ పేదలకు సాయం చేయాలని మూడేళ్ల క్రితం సమనుజ్ఞ ట్రస్ట్ ఏర్పాటు చేశారు. పిల్లలకు విద్యతోపాటు ఆరోగ్యమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. మూడేళ్లుగా జిల్లాలోని మారుమూల ఉన్న గిరిజన గ్రామాల్లోని పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, స్టడీమెటీరియల్ అందిస్తున్నారు. ట్రస్ట్ ద్వారా ఇప్పటికే రెండు వేలకు పైగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ ఏడాది ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు డెస్క్, బ్యాగులు పంపిణీ చేస్తున్నారు. ప్రత్యేకంగా తయారు చేయించిన బ్యాగులతోపాటు పెన్నులు, నోట్‌బుక్‌లు అందిస్తున్నారు. ఇప్పటికే గుబిడిపల్లి పాఠశాలలో విద్యార్థులకు డెస్క్ బ్యాగులు పంపిణీ చేయగా పాఠశాల విద్యార్థులకు ఉపయోగించుకుంటున్నారు. ఈ ఏడాది జిల్లాలోని మారుమూల పాఠశాలల్లోని 500మందికి పైగా డెస్క్ బ్యాగులు అందజేసే విధంగా ప్రణాళికతో ముందుకెళ్తునట్లు విశ్వనాథ్ తెలిపారు.

వాగులు దాటి.. మరమ్మతులు చేసి



వాగు దాటి వెళ్తున్న సిబ్బంది గంగన్న, సురేందర్



విరిగిపడ్డ చెట్టు



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



తెగిన విద్యుత్ లైన్

నిర్మల్ జిల్లా కడెం మండలంలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలోని ఉడుంపూర్ సమీపంలోని అటవీ ప్రాంతంలో భారీ వృక్షం విద్యుత్ లైన్‌పై పడింది. దీంతో మూడు స్తంభాల పరిధిలోని విద్యుత్ తీగలు తెగిపోయాయి. ఉడుంపూర్‌తోపాటు పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న విద్యుత్ సిబ్బంది గంగన్న, సురేందర్ ఆదివారం ఉదయం అటవీ ప్రాంతంలో వాగులు దాటి వెళ్లి విద్యుత్ లైనుకు మరమ్మతులు చేపట్టారు. సాయంత్రానికల్లా సరఫరా పునరుద్ధరించారు.

- కడెం

పంటల క్షేత్ర ప్రదర్శన



పత్తి క్షేత్ర ప్రదర్శనలో కేవీకే శాస్త్రవేత్తలు

ఎదులాపురం: జైనథ్ మండలం జైనథ్, నిరాల గ్రామాల్లో గల పత్తి, సోయా, కంది పంట క్షేత్రాల్లో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రాజశేఖర్, శివచరణ్ ఆదివారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం పత్తి పూత దశలో ఉందని, రసం పీల్చే పురుగులైన పచ్చదోమ, తెల్లదోమ ఆశించడం గుర్తించినట్లు పేర్కొన్నారు. నివారణకు ఫ్లోనికమిడ్ 60 గ్రాములు లేని పక్షంలో డైనటోఫెరాన్ 60 గ్రాములు లేని పక్షంలో ఎసిటమ్రిడ్+డైయపెండురాన్ 100 గ్రాములు లేదా డైయంఫెండురాన్+ఖైఫెంథ్రాన్ 250 మిల్లీ లీటర్లు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. అలాగే పత్తిలో ఆకుమచ్చల నివారణకు ప్రొపికొనాజోల్ 200 మిల్లీ లీటర్లు లేదా పెక్సాకొనాజోల్ 400 మిల్లీ లీటర్లు లేదా టెబుకొనజోల్ 200 మిల్లీ లీటర్లు లీటర్ నీటికి ఎకరానికి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. సోయాబీన్ కాత దశలో ఉందని, కాండపు తొలుచు పురుగు, కాండపు ఈగ ఆశించినట్లు గుర్తించామన్నారు. దీని నివారణకు ఇసోసైక్లోసోరమ్ 240 మిల్లీ లీటర్లు లేదా క్లోరంథ్రనిలిప్రోల్ 60 మిల్లీ లీటర్లు లేదా థయోమిక్సామ్+లామ్డాసైహలోత్రిన్ 50 మిల్లీ లీటర్లు ఎకరానికి పిచికారీ చేసుకోవాలని సూచించారు. కందిలో ఎండుతెగులు నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు.

నిర్మల్ కవులకు పురస్కారాలు



పోలీస్ భీమేశ్



తుమ్మల దేవరావు



తొడిశెట్టి పరమేశ్వర్



నేరేళ్ల హనుమంతు

నిర్మల్‌ఖిల్లా: తెలుగు వ్యవహారిక భాషోద్యమ పితామహుడు, ప్రముఖ సాహితీవేత్త గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా ఏటా ఇచ్చే గిడుగు జాతీయ సాహితీ కళా, సేవారంగాల పురస్కారాలను నిర్మల్ జిల్లాకు చెందిన నలుగురు కవులు దక్కించుకున్నారు. జిల్లాకేంద్రానికి చెందిన పోలీస్ భీమేశ్‌కు 'స్వేచ్ఛకు సంకెళ్లు' అనే కవితా సంపుటికి, తుమ్మల దేవరావుకు 'మట్టి పాదాలు' కవితా గ్రంథానికి వేర్వేరుగా 'గిడుగు జాతీయ సాహితీ పురస్కారం' దక్కింది. సాహితీ, కళా, సేవారంగాల్లో చేస్తున్న సేవలకు గాను తొడిశెట్టి పరమేశ్వర్‌కు, సేవారంగంలో అందిస్తున్న సేవలకు గాను నేరేళ్ల హనుమంతుకు 'గిడుగు జాతీయ సాహితీ సేవారంగ పురస్కారా'లు లభించాయి. గిడుగు రామ్మూర్తి పంతులు ఫౌండేషన్, నవ్యాంధ్ర రచయితల సంఘం సంయుక్తగా నిర్వహించనున్న జాతీయ సాహితీ పురస్కారాల ప్రదాన కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ నగరంలోగల ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఈనెల 29న ఉంటుందని పురస్కార గ్రహీతలకు సమాచారమందించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రతిష్టాత్మకమైన గిడుగు పురస్కారాలకు నిర్మల్ జిల్లాకు చెందిన నలుగురు ఏకకాలంలో ఎంపిక కావడంపై జిల్లాకు చెందిన పలువురు కవులు, కళాకారులు, రచయితలు అభినందనలు తెలిపారు.

తండ్రి మరణం తట్టుకోలేక తనయుడి మృతి



జాహూర్ అలీఖాన్, అబిద్ అలీఖాన్ (ఫైల్)

నిర్మల్‌టౌన్: తండ్రి మరణం తట్టుకోలేక కొడుకు మృతి చెందిన ఘటన నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. నిర్మల్ పట్టణంలోని ఆస్ర కాలనీకి చెందిన రిటైర్డ్ వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగి జాహూర్ అలీఖాన్ (74) అనారోగ్యంతో ఆదివారం ఉదయం ఇంట్లోనే మరణించాడు. తండ్రి మరణించిన విషయాన్ని ఆయన కుమారుడు అబిద్ అలీఖాన్(50) బంధువులకు, మిత్రులకు ఫోన్ చేసి సమాచారం అందించాడు. ఈ క్రమంలో అతను ఒక్కసారిగా కుప్పకూలాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందాడు. అబిద్ అలీఖాన్ టింబర్ డిపో నడుపుతున్నాడు. ఒకే రోజు తండ్రి, కొడుకు మృతి చెందడంతో వారి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

దవాఖానాలో చెట్లు నరికివేత

ముథోల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని చెట్లను ఆదివారం నరికివేయగా గ్రామ యువకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చెట్లు నరికిన విషయాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా చెట్లు నరకడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బాసరలో భక్తుల రద్దీ



పిల్లలకు అక్షర శ్రీకారం చేయిస్తున్న తల్లిదండ్రులు

బాసర: ఆది, సోమవారాలు వరుసగా సెలవులు రావడంతో నిర్మల్ జిల్లా బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం ఆదివారం తల్లిదండ్రులు తమ చిన్నారులకు ఆలయ అర్చకులతో అక్షర శ్రీకారం, కుమార్చన పూజలు చేయించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాఠక్ భక్తులకు అమ్మవారి హారతి, తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనానికి గంట సమయం పట్టిందని అధికారులు వెల్లడించారు.

బైక్ అదుపు తప్పి ఒకరికి గాయాలు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాందా (టీ) సమీపంలో ఆదివారం బైక్ అదుపు తప్పి ఆదిలాబాద్ పట్టణంలోని కొలిపురాకు చెందిన కారింగుల పోతలింగుకు గాయాలైనట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. పోతలింగు బైక్‌పై తలమడుగు గ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పేర్కొన్నారు. అతడిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుట్కా పట్టివేత

బోథ్: మండలంలోని పలు గ్రామాలకు గుట్కా సరఫరా చేస్తున్న ఇచ్చోడ మండలానికి చెందిన షేక్ షాజీద్‌ను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. పలు గ్రామాలకు గుట్కా సరఫరా చేస్తున్నాడన్న సమాచారం మేరకు కనుగుట్ట గ్రామ సమీపంలో షేక్ షాజీద్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతడి నుంచి రూ.27,611 విలువైన గుట్కా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అ'పూర్వ'ం.. విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005–06 సంవత్సరంలో 10వ తరగతి చదివినవారంతా ఇదే పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం పేరిట కలుసుకున్నారు. 18 ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులంతా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకున్నారు. పాఠశాలలో చదివిన జ్ఞాపకాలను గుర్తు చేసుకుని రోజంతా సందడి చేశారు. గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు లింగారెడ్డి, వెంకటరమణ, రాఘవరెడ్డి, అనుపమ, వినోద్‌కుమార్, సుభాష్, వర్మ, శ్రీనివాస్, లింగన్న, వేణు, రాజేశ్వర్ తదితరులున్నారు.

అనాథ పిల్లలను ఆదుకుంటాం



పిల్లల వివరాలు తెలుసుకుంటున్న అధికారులు



చిన్నారికి పాలు తాగిస్తున్న ఆత్రం సుగుణ

ఇంద్రవెల్లి: తల్లిని కోల్పోయి అనాథలైన కవల పిల్లలను అన్ని విధాలా ఆదుకుంటామని జిల్లా బాలల సంరక్షణ కేంద్రం అధికారి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని అందునాయక్‌తండాలో శనివారం కవల పిల్లలకు జన్మనిచ్చి తల్లి మృతి చెందగా.. విషయం తెలుసుకున్న జిల్లా బాలల సంరక్షణ కేంద్రం అధికారులు ఆదివారం అందునాయక్ తండాను సందర్శించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. పిల్లలను కేంద్రానికి అప్పగిస్తే అన్ని విధాలా ఆదుకుంటామని కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. తన భార్య దీక్ష కర్మకాండల వరకు ఉంచి ఆ తర్వాత కేంద్రానికి అందజేస్తానని, అప్పటివరకు తమ పిల్లల బాగోగులు తామే చూసుకుంటామని అధికారులకు తండ్రి గోవింద్ లేఖ రాసిచ్చారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. తల్లి, దండ్రులను కోల్పోయి అనాథలైన ప్రతీ చిన్నారిని ఆదుకోవడానికి బాలల సంరక్షణ కేంద్రం సిద్ధంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది అనిల్ ఉన్నారు.

చిన్నారులను ఆదుకుంటాం

అందునాయక్‌తండాలో బాలింత మృతితో తల్లిని కోల్పోయిన చిన్నారులను ఆదుకోవడానికి తనవంతు కృషి చేస్తానని కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ హామీ ఇచ్చారు. ఆదివారం ఆమె గ్రామాన్ని సందర్శించి మృతి చెందిన బాలింత కుటుంబీకులను పరామర్శించి ఆర్థికసాయం అందించారు. మొదటి విడతలోనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. పిల్లల చదువులకు భరోసా కల్పించారు. నాయకులు సునీల్‌జాదవ్, సోమోరే నాగోరావ్, విశాల్, రాజు, కాంబ్లే అతిశ్, అమోల్ తదితరులున్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. వారికి అందిస్తున్న వైద్య సేవల గురించి డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ద్వారా తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని పేర్కొన్నారు. వైరల్ జ్వరాలు విజృంభిస్తున్న దృష్ట్యా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నిత్యం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులున్నారు.

సంతానం కావడంలేదని ఆత్మహత్య

ఇంద్రవెల్లి: వివాహమై పదేళ్లయినా సంతానం కలగడంలేదని మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సునీల్, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పిట్టబొంగరం గ్రామానికి చెందిన చహకటి జంగుబాపు (30)కు పదేళ్ల క్రితం ఇచ్చోడ మండలంలోని దాబా గ్రామానికి చెందిన సీతాబాయితో వివాహమైంది. సంతానం కలగపోవడంతో పలు ఆస్పత్రులు తిరిగినా ఫలితం లేకపోయింది. దీంతో నాలుగు నెలలుగా జంగుబాపు మద్యానికి బానిస కాగా, భార్య సీతాబాయి మూడు నెలల క్రితం పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో శనివారం ఉదయం తాగిన మైకంలో వ్యవసాయ చేనుకు వెళ్లి జంగుబాపు పురుగుల మందు తాగాడు. సమీప రైతులు, కుటుంబ సభ్యులు 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి అన్న జగ్గెరావ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చెస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రుణమాఫీకి దూరమైన రైతులు

బోథ్: అధికారుల నిర్లక్ష్యంతో రైతులు రుణమాఫీకి దూరమవుతున్నారు. మార్లపెల్లి గ్రామానికి చెందిన సిందే శివాజీ బోథ్‌లోని పీఏసీఎస్ అధికారుల నిర్వాకంతో రుణమాఫీకి దూరమయ్యాడు. తాజాగా ఇదే గ్రామానికి చెందిన తూము గంగాధర్ ప్రాథమిక సహకార సంఘానికి ఎలాంటి రుణం లేకున్నా రూ.68,020 అప్పు ఉన్నట్లు సదరు అధికారులు రుణమాఫీ లిస్ట్‌లో పేరు పంపించారు. కాగా, గంగాధర్ స్థానిక టీజీబీలో రూ.1,58,253 రుణాన్ని పొందాడు. రెండుబ్యాంకుల్లో కలిపి రుణం రూ.2లక్షల పైగా ఉన్నట్లు చూపడంతో మాఫీ కాలేదు. తాను బోథ్ పీఏసీఎస్ నుంచి రుణం తీసుకోలేదని బాధితుడు వాపోతున్నాడు. అధికారుల నిర్లక్ష్యంతో అతడు రుణమాఫీకి దూరమయ్యాడు. పీఏసీఎస్‌లో చాలామంది రుణాలు చెల్లించినా, రుణమాఫీ లిస్టులో పేర్లు పంపగా మాఫీ కానట్లు తెలుస్తోంది.